1St Year Happy Work Anniversary.

షణ్ముఖ SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN RK

సంపుటి : 3 సంచిక : 56 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 26 ఫిబ్రవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు,నెల్లూరు

VOLUME : 03 ISSUE : 56 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE,NELLORE Thursday 26 February 2026 PAGES : 8 PRICE : 3/-



# వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నేనే ప్రాజెక్టును పూర్తి చేసేది నేనే

## రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు





2

## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం.. ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ కీలక ప్రకటన



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 25)
రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేసి, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం 'క్లస్టర్ బేస్డ్' విధానంతో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ ▶మిగతా 2లో

## రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 25)
రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడితప్పాయని కేంద్ర హోంశాఖ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. 'శాంతిభద్రతల అంశంపై సభలో చర్చిద్దామని కోరితే, ప్రభుత్వ వైఫల్యాలు ప్రశ్నిస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. అందుకే వాకౌట్ చేశాం. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉంటే కూటమి నాయకులు మంచి ప్రభుత్వం అంటూ భజన చేస్తున్నారు. రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు చనిపోయి, పలువురు ఆసుపత్రుల్లో చేరినా ఒక్క అధికారిపైనా చర్యలు తీసుకోలేదు. తప్పుచేస్తే ప్రభుత్వం శిక్షిస్తుందన్న భయం వ్యవస్థల్లో లేదు. సభలో రాజశేఖరరెడ్డిని కించపరిచి మాట్లాడడం సరికాదు' అని అన్నారు.

## ప్రతిరోజూ పరీక్ష అన్నట్లు సిద్ధమవ్వాలి

**మంత్రులు, ఎమ్మెల్యేలూ పూర్తి పరిజ్ఞానంతో సభలో మాట్లాడాలి**
**ఎలా మాట్లాడుతున్నారో ఏఐతో విశ్లేషిస్తాం**
**మంత్రులతో సీఎం చంద్రబాబు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 25)
ప్రతిరోజూ పరీక్ష అనే స్ఫూహతో మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో సన్నద్ధమై అసెంబ్లీకి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏదైనా అంశాన్ని సభలో ఒకసారి సమర్థంగా ప్రజంట్ చేయగలిగితే అది ఏడాదిపాటు ఇంటింటికీ తిరిగి చెప్పేదానికి సమానంగా ఉంటుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సభలో విషయాన్ని ఎంత ప్రభావవంతంగా ప్రస్తావిస్తున్నారు? వారి ప్రజంటేషన్ ఎలా ఉందనేదానిపై 'ఏఐ' ద్వారా విశ్లేషిస్తున్నామని చెప్పారు. ▶మిగతా 2లో



## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం... ఏపీ క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 25)

- ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం
- ధృవీకరణ పత్రాలున్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్
- విశాఖలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం
- రాష్ట్రవ్యాప్తంగా పలు పర్యాటక, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు పచ్చజెండా
- కల్తీ పాలు, డయేరియా ఘటనలపై సీఎం సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

2

## జగనన్న లేఔట్లలో రూ.7 వేల కోట్ల కుంభకోణం



**నాటి అధికార పార్టీ నేతల భూదందా**
**పేదల ఇళ్ల నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం**
**మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 25)
పేదలకు ఇళ్లస్థలాల పేరుతో వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న లేఔట్లలో రూ.7వేల కోట్ల కుంభకోణం జరిగిందని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. నాటి అధికారపార్టీ నేతలు ప్రజల నుంచి తక్కువ ధరకు భూములు లాక్కొని, అంతకు రెండు, మూడు రెట్ల ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించారని తెలిపారు. జగనన్న లేఔట్ల ఏర్పాటుకు రూ.10,414 కోట్లు కేటాయించగా, అందులో సగానికిపైగా నిధులు దుర్వినియోగమైనట్లు మంత్రి స్పష్టం చేశారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో.. 'గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల మంజూరులో అవకతవకలు జరిగాయా' అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి అనగాని సమాధానమిచ్చారు. ▶మిగతా 2లో

## ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా విశాఖ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఫిబ్రవరి 25)
విశాఖ తీరంలో పర్యాటక ప్రాజెక్టుల నిర్వహణకు అవరోధంగా ఉన్న సీఆర్‌జడ్ నిబంధనల్లో సడలింపుల కోసం కేంద్రాన్ని సంప్రదిస్తున్నామని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణయాదవ్, వెలగపూడి రామకృష్ణబాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 'విశాఖను హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నాం. సీ-ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలిటూరిజంపై దృష్టి సారించాం. అడ్వెంచర్, యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామ'ని ▶మిగతా 2లో



## హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు సంబంధం లేదు: లోకేశ్




(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఫిబ్రవరి 25)
బాబాయ్‌ని చంపి కత్తి తమ చేతిలో పెట్టినట్లే.. వీఎస్ఆర్ ఏవియేషన్ విషయంలో వైకాపా ఆరోపణలు ఉన్నాయని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు.

2

## జనసేన ఉద్యమి సమావేశం

### అహుడా చైర్మన్ టిసి వరుణ్‌ను కలిసిన ఏఎంసీ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 25)**

జనసేన పార్టీ నిర్వహించిన ఉద్యమి సమావేశం సందర్భంగా ఆ పార్టీ నాయకులు పరస్పరం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అనంతపురం అహుడా చైర్మన్ టిసి వరుణ్‌ను బద్వేలు జనసేన పార్టీ ఏఎంసీ డైరెక్టర్ చిన్ని సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, గ్రామస్థాయి సమస్యల పరిష్కారం, యువతకు రాజకీయ అవకాశాల కల్పన వంటి అంశాలపై ఇరువురు నాయకులు చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బద్వేలు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని చిన్ని సుబ్బారావు పేర్కొన్నారు. ఉద్యమి సమావేశం విజయవంతంగా నిర్వహించినందుకు నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## తొట్టిగారిపల్లిలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు





**(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఫిబ్రవరి 25)**

బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి క్యాన్సర్ వ్యాధిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ కు చెందిన డాక్టర్ రమేష్ బాబు హాజరై క్యాన్సర్ లక్షణాలు, నిర్ధారణ, చికిత్స విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సమాజంలో క్యాన్సర్ వ్యాప్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఆరోగ్య సిబ్బంది ప్రజలకు ముందస్తు గుర్తింపుపై చైతన్యం కల్పించాలని సూచించారు. మొదటి దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తి స్థాయిలో నయం చేయవచ్చని తెలిపారు. అలాగే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అర్హులైన వారికి ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించబడుతుందని, ప్రతి నెల మొదటి శనివారం బద్వేల్ పట్టణంలోని సంజీవిని ఆసుపత్రిలో డాక్టర్ రమేష్ అందుబాటులో ఉంటారని తెలిపారు. మహిళల్లో నోటి క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్; పురుషుల్లో నోటి క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్ వంటి వ్యాధులపై స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినయ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రావతి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ జె జనార్దన్‌రావు, మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ ఆర్‌సెట్‌లో శరణ్యకు మూడో ర్యాంక్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)**

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పీహెచ్డీ కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని వహించిన ఏపీ ఆర్‌సెట్‌లో మండలంలోని కరవది గ్రామానికి చెందిన నారాయణ సాయి శరణ్య రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. శరణ్య ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఒంగోలు నుండి మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్‌లో పిజీ పూర్తి చేసింది. ఇటీవల ప్రకటించిన యూజీసీ నెట్‌లో కూడా పీహెచ్డీకి శరణ్య అర్హత సాధించింది.

మొదటి పేజీ తరువాయి

# వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది నేనే

## వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసేది నేనే

### రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం మార్కాపురం జిల్లాలో పర్యటించారు. మొదటిగా వెలుగొండ ప్రాజెక్టుకు కీలకమైన ఫీడర్ కెనాల్ మరమ్మత్తులకు రూ.456 కోట్లతో దోర్నాల మండలంలోని గంటవానిపల్లి వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం మార్కాపురం పట్టణంలో తర్లుపాడు రోడ్‌లోని సాయి బాలాజీ స్కూల్ ఎదుట ఏర్పాటు చేసిన బహిరంగ సభకు విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టుకు అప్పుడు శంకుస్థాపన చేసింది నేనేనని ఈ ఏడాది జులై నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తానని అన్నారు. 2019 ఎన్నికల్లో వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని నియోజకవర్గాలలో ఒక్క నియోజకవర్గంలో కూడా ప్రజలు తెలుగుదేశం పార్టీని గెలిపించలేదని కానీ అదే ప్రజలు గత ఎన్నికల్లో రెండు నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా కుల మతాలకతీతంగా ఈ అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పడిన మార్కాపురం నూతన జిల్లా కార్యాలయాల ఏర్పాటు కోసం అప్పటికప్పుడే 50 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. దీంతో ప్రజల హర్షధ్వానాలు నిన్నంటాయి. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ చంద్రబాబు నాయుడుకి రుణపడి ఉంటారని అన్నారు. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయుటకు రూ.25 కోట్లు అవసరమని అభ్యర్థించారు. అత్యంత కీలకమైన మార్కాపురం – తర్లపాడు రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయుటకు రూ.15 కోట్లు అవసరం అవుతాయని ముఖ్యమంత్రిని కోరారు. ఈ ప్రాంతంలో మిర్చి రైతులు ఎక్కువగా ఉన్నారని, కావున ముఖ్యమంత్రి దయ ఉంచి మార్కాపురం పట్టణంలో మినీ మిర్చి యార్డు ఏర్పాటు చేయాలని కోరారు. మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలంను వెలుగొండ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోకి తేవాలని అభ్యర్థించారు. అత్యంత వెనుకబడిన మార్కాపురం నియోజకవర్గంలో గ్రామాల్లో సీసీ రోడ్లను పూర్తి చేయుటకు రూ.76 కోట్లు అవసరమని వాటిని మంజూరు చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, ఏపి మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, పెందుర్తి వెంకటేష్, మార్కాపురం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణం ప్రజలు, మహిళలతో కిటకిటలాడింది. సభాస్థలికి వెలుపల కూడా ప్రజలు వేల సంఖ్యలో వేచియున్నారు. మొత్తం మీద ఈ సభ అంచనాలకు మించి ముందు ఎప్పుడు లేని విధంగా విచ్చేసిన జనంతో విజయవంతమయింది.

మొదటి పేజీ తరువాయి

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం... ఏపీ క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణల రంగాలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్' పేరిట కొత్త శాఖను ఏర్పాటు చేసే ప్రతిపాదనకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పాలనా సౌలభ్యం పెంచి, అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ సమావేశంలో మొత్తం 55 అజెండా అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో ముఖ్యంగా, ధృవీకరణ పత్రాలు కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపే క్రమంలో విశాఖపట్నంలో రూ. 2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అదేవిధంగా, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, చీరాల, తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులతో పాటు సౌర, పవన, హైబ్రిడ్ ఇంధన ప్రాజెక్టులకు కూడా మంత్రి మండలి ఆమోదం తెలిపింది.రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయాలను కూడా కేబినెట్ ధృవీకరించింది. కొల్లేరు అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించి కేంద్రానికి పంపాల్సిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అలాగే, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 28న పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ రోజు అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని కూడా తీర్మానించారు.సమావేశం సందర్భంగా రాజమండ్రిలో కల్తీ పాల ఘటన, శ్రీకాకుళంలో డయేరియా కేసులు ప్రబలడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరో ఆసక్తికర అంశంగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రుల ప్రసంగాలను కృత్రిమ మేధ (ఏఐ) సహాయంతో విశ్లేషిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతిపై చర్చకు మంత్రులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని కూడా సూచించారు. తాజా నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు సంబంధం లేదు: లోకేశ్

మీడియా ప్రతినిధులతో మంత్రి లోకేశ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు. "హెరిటేజ్‌కు.. వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదు. హెరిటేజ్ ఫిన్ లీస్ అనేది 1996లో స్థాపించిన సంస్థ. అనేక ఇతర సంస్థల మాదిరిగానే 2022లో హెరిటేజ్ ఫిన్ లీస్ వద్ద వీఎస్ఆర్ ఏవియేషన్ ఫైనాన్స్ తీసుకుంది. ఆరోజు మేము అధికారంలోకి వస్తామని, మా ఎంపీ ఏవియేషన్ మంత్రి అవుతారని కలగన్నామా? అజిత్ పవార్ వీఎస్ఆర్ ఫ్లైట్ ఎక్కుతారని.. అది ప్రమాదానికి గురవుతుందని ఊహించామా?. జగన్ చేసే ప్రతి నిరాధార ఆరోపణకు నేను ఎందుకు సమాధానం చెప్పాలి? క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉన్న ప్రతి ప్రశ్నకు దీటైన సమాధానం చెబుతాం. వీఎస్ఆర్ ఏవియేషన్ వ్యవహారంపై పూర్తి వివరాలు అందిస్తా" అని లోకేశ్ అన్నారు.చిల్లర దొంగలను పట్టుకుని గజదొంగలను వదిలేస్తున్నారన్న బొత్స వ్యాఖ్యలపై కూడా లోకేశ్ స్పందించారు. జగన్ గజ దొంగ అని బొత్స చెబుతున్నారా.. జగన్‌ను పట్టుకోవాలని చెబుతున్నారా..? అని ప్రశ్నించారు.

**దానికి ప్రిన్సిపల్ చంద్రబాబు..**

"ఎమ్మెల్యేలకు రెసిడెన్షియల్ క్లాసులు పెడతాం. రెండు రోజులపాటు వారంతా పార్టీ కార్యాలయంలోనే ఓరియెంటేషన్ క్లాసులో ఉండాలి. ఈ క్లాస్‌కు ప్రిన్సిపల్ సీఎం చంద్రబాబు.. మేమంతా విద్యార్థులమే" అని లోకేశ్ అన్నారు.

## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం.. ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ కీలక ప్రకటన

మంత్రి నారా లోకేశ్ తెలిపారు. సూపర్-6 హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనపై ప్రభుత్వ ప్రణాళికను ఆయన వివరించారు.

ఈ కొత్త విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించినట్లు లోకేశ్ తెలిపారు. రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధనం, కడప-చిత్తూరుల్లో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో గ్లాస్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ వంటి క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒకే చోట ప్రధాన పరిశ్రమలతో పాటు వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని వివరించారు.పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో తయారయ్యే ప్రతి 100 ఏసీలలో 50 మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయని, డైకిన్, ఎల్జీ వంటి కంపెనీలు తమకు అవసరమైన కోర్సులను ఐటీఐలలో ప్రవేశపెట్టాలని కోరాయని చెప్పారు. పరిశ్రమల భాగస్వామ్యంతో కోర్సుల కరిక్యులమ్ మార్చి, యువతకు నాణ్యమైన శిక్షణ అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73,000 మందికి శిక్షణ ఇవ్వగా, వారిలో 40,000 మందికి ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలు సులభంగా కల్పించేందుకు 'నైపుణ్యం' పేరుతో ఒక వినూత్న పోర్టల్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు లోకేశ్ వెల్లడించారు. ప్రపంచంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత టెక్నాలజీతో ఈ పోర్టల్ పనిచేస్తుందని, దీని ద్వారా యువత తమ నైపుణ్యాలను స్వయంగా అంచనా వేసుకోవచ్చని, రెస్యూమ్ తయారు చేసుకోవచ్చని, ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకోవచ్చని వివరించారు. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు కూడా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటివరకు నిర్వహించిన 1,587 జాబ్ మేళాల ద్వారా 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రపంచస్థాయి కార్మికులను తయారు చేసేందుకు న్యాక్‌ను 90 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన బలోపేతం చేస్తామని మంత్రి లోకేశ్ సభకు హామీ ఇచ్చారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వం సమన్వయంతో పనిచేసి ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించడమే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

## ప్రతిరోజూ పరీక్ష అన్నట్లు సిద్ధమవ్వాలి

బడ్జెట్ పద్దులపైనా మంత్రులు పూర్తిస్థాయిలో సన్నద్ధమై వచ్చి సభలో సమాధానాలివ్వాలన్నారు. ప్రతిపక్షం సభకు వచ్చి నిర్మాణాత్మక పాత్ర పోషించాల్సింది పోయి.. బయట బాధ్యత లేని రాజకీయాలు చేస్తోందని సీఎం విమర్శించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రోజూ మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఒక అంశంపై లఘుచర్చ చేపడదామని సీఎం సూచించారు. సంబంధిత శాఖ మంత్రి చర్చను లీడ్ చేస్తారని, కూటమి పార్టీల సభ్యులంతా భాగస్వాములై అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సందర్భాన్ని బట్టి తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్చలో పాల్గొంటామని మంత్రులకు సీఎం చెప్పారు.

## జగనన్న లేఔట్లలో రూ.7 వేల కోట్ల కుంభకోణం

**అనర్హులకు 7 లక్షలకుపైగా ప్లాట్లు**

'గత ప్రభుత్వం 31,35,320 దరఖాస్తులు రాగా, 22,80,358 మందికి స్థలాలు ఇచ్చారు. వారిలో 15 లక్షల మందే అర్హులు. మిగిలిన 7 లక్షలకుపైగా స్థలాలు వైకాపా నేతల బంధువులకు కట్టబెట్టారు. అధికారుల కమిటీ పరిశీలించి, ఇప్పటికే 43,948 మందిని అనర్హులుగా గుర్తించింది. మరో 1.11 లక్షల పట్టాలు పరిశీలనలో ఉన్నాయి. అనర్హులకు కేటాయించిన స్థలాలు రద్దుచేస్తాం' అని సత్యప్రసాద్ తెలిపారు.

**అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు**

'పేదలకు ఆవాసం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం ఇవ్వాలన్నది ప్రణాళిక. పట్టణాల్లో స్థలాల కొరత ఉన్నందున టిడ్కో, పట్టణ స్థానికసంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థల ద్వారా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించాం. స్థలాల కోసం ప్రజల నుంచి 4 లక్షలకుపైగా దరఖాస్తులొచ్చాయి. 1.03 లక్షల మందిని అర్హులుగా గుర్తించాం. 1.41 లక్షల దరఖాస్తులు తిరస్కరించాం. మరో 1.56 లక్షల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి' అని మంత్రి వివరించారు.

## ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా విశాఖ

వివరించారు. విశాఖలో వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తే అక్కడినుంచి పర్యాటకులు విదేశాలకు వెళ్లాల్సిన అవకాశం రాదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు.

**ఆర్టీసీ ఉద్యోగుల వైద్యానికి అదనపు సాయం**

**రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి**

ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కింద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో చికిత్సకు అందిస్తున్న రూ.2 లక్షల ప్రభుత్వ సహాయంతో పాటు అదనంగా మరో రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'ఈహెచ్ఎస్‌లో ఆర్టీసీ ఉద్యోగులతోపాటు వారి కుటుంబసభ్యులకూ వైద్యసేవలు అందిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 1,900 ఆసుపత్రుల్లో 45వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు వైద్యసేవలు పొందుతున్నారు' అని చెప్పారు.

**రూ.1,077 కోట్లతో అడవితల్లి బాటలు: మంత్రి నాదెండ్ల మనోహర్**

అడవితల్లి బాట కింద గిరిజన గ్రామాల్లో రూ.1,077.26 కోట్లతో 393 రోడ్లు, 33 వంతెనల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు బదులుగా మనోహర్ సమాధానమిచ్చారు. 'ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లోని కొఠియా గ్రామాల వివాద పరిష్కారానికి రెండు రాష్ట్రాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. ఆ గ్రామాల ప్రజలు ఏపీలోనే కలిసేందుకు సుముఖంగా ఉన్నా, ఒడిశా అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చి ఆ రాష్ట్రంలో కలిపేందుకు యత్నిస్తున్నారు. ఆ గ్రామాల ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లోనూ ఓటు వేస్తున్నారు' అని ఎమ్మెల్యే రామకృష్ణ పేర్కొన్నారు.







ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు | తెలుగు దినపత్రిక

26.02.26 గురువారం


## ముఖ్యమంత్రి సభ అయితే మాకేం...!

**ఫోటో ఫోజులకే పరిమితం**

**కార్యకర్తలే కార్యక్రమ నిర్వాహకులు**

**తీవ్ర చర్చకు దారితీసిన కొందరి నేతల తీరు**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 25)**

మార్కాపురం నియోజకవర్గంలో పొదిలి నాయకుల రూటే సపరేటు....ఏ కార్యక్రమం నిర్వహించినా నాయకులు అంతంతమాత్రంగానే కనిపిస్తుంటారు.... పనులు చేసుకోవాలన్నా, డబ్బు సంపాదించుకోవాలన్నా ముందు వరుసలో ఉండే కొంత మంది నాయకులు ఎమ్మెల్యే మాటలకు సైతం విలువ ఇవ్వని పరిస్థితి....మార్కాపురం జిల్లా సాధకుడు, సుదీర్ఘంగా 65 రోజుల పాటు పోరాటం చేసి కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలో మార్కాపురం జిల్లాను సాధించుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మార్కాపురం జిల్లా ఏర్పడ్డ తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలి పర్యటనను విజయవంతం చేసేందుకు గత నాలుగు రోజులుగా అహర్నిశలు, రాత్రి, పగలు అనే తేడా లేకుండా అందరినీ ఏకం చేస్తూ ఇంటింటికి నాయకులను పంపి మరీ సభను జయప్రదం చేయాలని చూశారు.

అయితే ప్రజలు కూటమి ప్రభుత్వం పై సానుకూలంగా ఉండడంతో దాదాపు 40 నుంచి 45 వేల మంది జనాభా మార్కాపురం బహిరంగ సభకు హాజరై సభను విజయవంతం చేశారని ఇంటలిజెన్స్ విభాగం వారు సైతం చర్చించుకున్నారంటే సభ ఏ విధంగా సక్సెస్ అయ్యిందో వేరే చెప్పనక్కరలేదు. అయితే ఈ సభ విజయవంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాను ఇవ్వడం, వెలుగొండ పనులను పరుగెత్తించి మరో నాలుగు నెలల్లో నీటిని అందిస్తారన్న ఆశతో జనం సభకు వేలాదిగా తరలివచ్చారు. అయితే ఈ సభ విజయవంతంలో స్థానిక నాయకులు ప్రధాన భూమిక పోషించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమావేశం పెట్టి చెప్పినా కూడా పొదిలి నేతల తీరు (తరువాయి 4లో...)

# రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్





**ఈ ఏడాది జూలైకి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి నీళ్లు**

**మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం..**

**రూ.50 కోట్లతో కలక్టరేట్**

**జూన్ 15 నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి**

**ప్రతి వారం ప్రాజెక్టు పురోగతి పై నివేదిక అందించాలి**

**జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం**

**గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చేశారు**

**వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన**

**మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ**

**బహిరంగ సభా వేదికలో సీఎం చంద్రబాబునాయుడు**



4





# పూర్తికాని వెలుగొండను.. జాతికి అంకితమంటూ జగన్ మోసగించారు

**గుండ్లకమ్మ గేట్లు విరగ్గొట్టి ఇసుక దోపిడీ చేశారు**


**ఐదేళ్లలో అన్ని వ్యవస్థల్నీ జగన్ రెడ్డి భ్రష్టు పట్టించాడు**

**కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం**

**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)**

పూర్తికాని వెలుగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశామంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా ప్రజలను మోసగించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. పనులు పూర్తిచేయకుండా కేవలం ప్రచారానికే పరిమితం అయ్యారని దుయ్యబట్టారు. రైతుల ఆశలను వమ్ము చేస్తూ ప్రాజెక్టును రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు ధ్వంసం చేసి, భారీ ఎత్తున ఇసుక దోపిడీ చేశారని అన్నారు. ప్రజా సంపదను కాపాడాల్సిన ప్రభుత్వం దానినే దోచుకుందన్నది దురదృష్టకరమన్నారు. ఇలా జగన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో అన్ని వ్యవస్థలను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లాలో బుధవారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక బహిరంగ సభలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ కూటమి ఏర్పడిన వెంటనే గుండ్లకమ్మకు కొత్త గేట్లను ఏర్పాటు చేయడంతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం 20 లక్షల చేప పిల్లలను గుండ్లకమ్మలో వదిలిన విషయాన్ని మంత్రి సభా ముఖంగా గుర్తు చేశారు. వెలిగొండ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు బడ్జెట్ లో నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా వేగవంతం చేసినట్లు స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. గడిచిన 19 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదలకు వెయ్యి కోట్లు రూపాయిలు సహాయం చేశామని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి పేదల పెన్షన్ వెయ్యి రూపాయిలు పెంచడానికే ఐదేళ్లు పట్టిందని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని హామీలను అమలు



చేస్తున్నామని ఆయన తెలిపారు. కేవలం ఒక్క సంతకంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పెన్షన్ ను వెయ్యి రూపాయిలు పెంచారని చెప్పారు. ఆర్థిక అసమానతలు తొలగించడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమాన్ని రూపొందించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

### విద్యుత్ వ్యవస్థ సర్వనాశనం

2019 వరకు మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ వైసీపీ పాలన ఐదేళ్లలో సర్వ నాశనం అయ్యిందని మంత్రి గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగోలు విద్యుత్ కొనుగోళ్లు, అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్ వ్యవస్థకు రూ.1.29 లక్షల కోట్లు నష్టం వాటిల్లిందని వెల్లడించారు. పాదయాత్రలో ఇచ్చిన దొంగ హామీలతో ప్రజల్ని మోసం చేసి జగన్ అధికారం చేపట్టారని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. ఒక్కసారి ఓటంటూ అధికారం చేపట్టిన వైసీపీ, రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని ఆరోపించారు. 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై సుమారు రూ.30 వేల కోట్లు విద్యుత్ భారాన్ని మోపారన్నారు. కూటమి అధికారం చేపట్టిన 15 నెలల కాలంలోనే 13 పైసలు ట్రూ డౌన్ చేయడమే కాకుండా, గడిచిన 19 నెలల్లో ఒక్క పైసా కూడా విద్యుత్ ఛార్జీ పెంచలేదని ఆయన స్పష్టం చేశారు.

### ఆలయం అపవిత్రం.... లడ్డూ కల్తీ....

దేశంలోని హిందువులందరూ అతి పవిత్రంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కూడా జగన్మోహన్ రెడ్డి అపవిత్రం చేశారని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. కోట్లాది భక్తులకు ఎంతో ప్రీతి పాత్రమయిన తిరుపతి లడ్డూని కూడా కల్తీ చేశారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వ్యవస్థల్నీ గాడిలో పెడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. చివరగా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకరించారని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన పెరికె సుఖదేవ్





**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఫిబ్రవరి 25)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం మార్కాపురంలో జరిగే బహిరంగ సభకు సభా వేదిక దగ్గరలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రోత్సాహంతో హెలిప్యాడ్ వద్దకు గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ చేరుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తన తండ్రి మాజీ జడ్పీటిసి స్వర్గీయ జయదేవ్ గురించి తెలియజేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జయదేవ్‌తో తనకున్న సాన్నిహిత్యం ను గుర్తు చేసుకున్నట్లు తెలిసింది.

# రైతులకు సబ్సిడీ డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ



(షణ్ముఖ వెలుగు, చినగంజాం, ఫిబ్రవరి 25)

రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల వ్యవస్థ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నదని, డ్రిప్ స్ప్రింక్లర్లతో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చుని, రైతులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రిప్, స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందిస్తున్నదని ఎపిఏమ్ సుబ్బారావు అన్నారు. బుధవారం మండలంలోని మోటుపల్లి పంచాయతీ నందు వెలుగు డిఆర్డిఏ, ఎపిఎమ్ఐబి ఆద్వర్యంలో ఎపిఏమ్ సుబ్బారావు, షేక్ స్వరీఫ్ కలిసి రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఏమ్ సుబ్బారావు, షేక్ స్వరీఫ్ మాట్లాడుతూ మండలంలో సబ్సిడీ మేద డ్రిప్, స్ప్రింక్లర్ల కావల్సిన రైతులు వారు కట్టవలసిన వాటా క్రమ ధనము ఎఫ్‌పిఓ ద్వారా అందించటం జరుగుతుందని తెలిపారు. సాగు రైతులు సబ్సిడీ యాంత్రలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎమ్ఐబి షేక్ స్వరిఫ్, ఎపిఏమ్ సుబ్బారావు, సీసీ వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

జడ్జి బి రూపశ్రీ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 25)

మార్చి 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కనిగిరి కోర్టు ఆవరణలో కనిగిరి కోర్టు పరిధిలో ఉన్న న్యాయవాదులతో పాటు బ్యాంక్ ఉద్యోగులకు, మున్సిపాలిటీ అధికారులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి రూపశ్రీ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు.కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోనేటట్లు చూడాలని సూచించారు.వాది, ప్రతివాదులకు లోక్ అదాలాత్ పై అవగాహన కలిగించి ఈ జాతీయ లోక్ అదాలత్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోని సివిల్, క్రిమినల్, భరణం, బ్యాంక్ కు సంబంధించిన కేసులను పరిష్కరించుకోనే విధంగా అందరూ కృషి చేయాలని అన్నారు.కార్యక్రమంలో కోర్టు పరిధిలోని న్యాయవాదులు, బ్యాంక్ ఉద్యోగులు, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)

ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. బుధవారం వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ లైనింగ్ పనులను ఆయన ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో గల సాయి బాలాజీ పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని సీఎం వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని సీఎం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ...'గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది

1996 మార్చి 5న ఈ ప్రాంతంలో తాను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్ళారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు తనను కోరారు. ఆ నాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ తనకే అవకాశం ఇచ్చాడు. వెలుగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటి రోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. తాను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు వ్యయం చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలుస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయని ముఖ్యమంత్రి అన్నారు.

రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు

అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్ కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జూలై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రీనీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండ పై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

రూ.50 కోట్లతో జిల్లా కలెక్టరేట్ నిర్మిస్తాం

ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫోటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనానికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం. వరద నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు

గత పాలకులు చేయని అపచారం లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారు. కెమికల్స్ కలిపిన నెయ్యితో లడ్డూలు చేసి విక్రయించారు. ఆ నెపాన్ని హెరిటేజ్ పై మోపారు. ఆనాడు బాబాయ్ ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడతారు. నా తల్లి, భార్య, మా పార్టీ నేతలను ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు. వాళ్లు బెదిరిస్తే ఇవ్వాలా. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తేనే ఏదైనా సాధ్యం అని కూడా వారికి తెలీదా? గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస జరిగింది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. గంజాయి, భూ కబ్జాలు, దౌర్జన్యాలతో హడలిపోయారు. నేను ఎవరు తిట్టినా లెక్కపెట్టుకోను. నేను జీవిస్తోంది ప్రజలు, రాష్ట్రం కోసమే. నాకు కుల, మత విభేదాలు లేవు. తెలుగు జాతి అభ్యున్నతి నాకు ముఖ్యం. బడుగు, బలహీన వర్గాలను పైకి తీసుకొచ్చి అవకాశాలు కల్పిస్తాం. నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. మన దూరదృష్టి కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గుజరాత్ రాష్ట్రంలో 25 ఏళ్లుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. మోదీ 3వ సారి ప్రధాని అయ్యారు. మరోసారి అవుతారు. ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది ఆలోచన చేసి కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమర్థులను గెలిపించాలని ముఖ్యమంత్రి కోరారు.

స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కాలువ పనులు పరిశీలన

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల శంకుస్థాపన అనంతరం రైతులు వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండి వీరారెడ్డిలతో సంభాషిస్తూ ఫీడర్ కెనాల్ పనుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. వెలిగొండ పూర్తి అయితే ఈ ప్రాంత భూగర్భజలాలు కూడా పెరుగుతాయని, బోర్లకు, చెరువులకు నీరు వస్తాయని ముఖ్యమంత్రికి రైతులు వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు, ఫీడర్ కాలువ పనులు వేగంగా చేపడుతున్నందుకు ముఖ్యమంత్రికి స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు. అరటి, బొప్పాయి లాంటి పంటల సాగు చేసేందుకు అనుకూల ప్రాంతమని, మీరే శంకుస్థాపన చేశారు, మీరే ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్నారని సీఎంతో రైతులు అన్నారు. ప్రాజెక్టులో రూ.2500 కోట్ల విలువైన పనులు మిగిలి ఉన్నా వాటిని పూర్తి చేయకుండా జాతికి అంకింతం చేసినట్టు గత పాలకులు నాటకాలాడారని ముఖ్యమంత్రి అన్నారు.

వెలిగొండ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష

ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. 11,580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కాలువ పనులు చేపట్టామని జల వనరుల శాఖ అధికారులు వివరించారు. నల్లమల సాగర్ ప్రాంతంలో మూడు గ్యాప్స్ ఫిల్ చేసి రిజర్వాయర్ ఏర్పడిందని, తద్వారా 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రోజుకు 200 మీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నామని, 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మేర సైడ్ వాల్ పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. ఫ్లడ్ సీజన్ ప్రారంభం అయ్యే సమయానికి ఫీడర్ కాలువ సిద్ధం అయిపోతుందని వెల్లడించారు. 45 రోజుల్లో 45 టీఎంసీల మేర నీరు డ్రా చేసుకుని నల్లమల సాగర్ నింపేందుకు ప్రణాళిక చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు, కాలువ పనులు తదితర అంశాలను నమూనా ద్వారా వివరించారు. కంబం చెరువును కూడా నింపేలా కాలువను అనుసంధానించినట్టు తెలిపారు. స్థానికంగా వివిధ చెరువులు, నీటి వనరుల్ని నింపేందుకు అవసరమైన స్ట్రక్చర్లను పూర్తి చేయాలని సీఎం అధికారులకు ఆదేశించారు. రూ. 400 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వెలిగొండ టన్నెళ్ల పనులు పూర్తి అయ్యాక, పోరుమామిళ్ల, రాచర్లకు కూడా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి ఎప్పటికప్పుడు తనకు తెలియచేయాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

మార్కాపురంలో ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం

నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారి మార్కాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. జిల్లా ఏర్పాటు కలను నిజం చేసినందుకు ముఖ్యమంత్రికి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ జలకళ సభకు హాజరైన ముఖ్యమంత్రికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేదిక నుంచి ప్రజల మధ్యకు వేసిన ర్యాంపు పై నడుస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రజలు హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగం యావత్తూ ఉత్సాహంగా సాగింది. సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు, అభిమానులు తరలి వచ్చారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు కదిలిన టీడీపీ శ్రేణులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 25)

వెలుగొండ ప్రాజెక్టు ఫీడల్ కాలువ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా మార్కాపురం జిల్లాకు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వచ్చారు. ఈ సందర్భంగా మార్కాపురం పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు పొదిలి పట్టణం నుంచి పలువురు టిడిపి నేతలు వాహనాల్లో మార్కాపురం సభకు చేరుకున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో నాలుగు బస్సులు, మూడు కార్లలో సుమారు 250 మంది సభకు వెళ్ళారు. అదే విధంగా తెలుగు యువత పట్టణ అధ్యక్షులు షేక్ కాలేషా ఆధ్వర్యంలో తనకు అప్పగించిన బాధ్యత ప్రకారం ఓ బస్సులో సుమారు 45 మంది అభిమానులను తరలించారు. మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్ ఆధ్వర్యంలో కాటూరివారిపాలెం నుంచి మూడు బస్సులు, మూడు కార్లలో సుమారు 140 మందిని బహిరంగ సభకు తరలివెళ్ళారు.











# ముఖ్యమంత్రి సభ అయితే మాకేం...!

మారలేదని కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ నాయకుడు ఆదేశాలను శిరసా వహించాలని కార్యకర్తలు భావించినంతగా నాయకులు భావించకపోవడం శోచనీయం. మండలంలో ఏ పని అయినా సరే ముందు నాయకులకే అప్పగిస్తారు ఎమ్మెల్యే... కానీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మార్కాపురం బహిరంగ సభకు చాలా మంది నాయకులు ముఖ్యమంత్రిని కలిసి ఫొటోలు దిగాలనే తపన, కార్యకర్తలు, అభిమానులు వెళుతున్న వాహనాల వద్ద ఫొటోలు దిగారే తప్ప ప్రజలను సభకు తరలించడంలో విఫలమయ్యారనే ప్రచారం జోరుగా సాగింది. కార్యకర్తలు మాత్రం ఎమ్మెల్యేకు చెడ్డపేరు రాకుండా ఉండేందుకు కష్టపడి మరి వారికి అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించారు. పొదిలి నాయకులు చాలా మంది మార్కాపురం బహిరంగ సభకు ప్రజలను తీసుకువచ్చిన పరిస్థితి లేదు. ఏదో మొక్కుబడిగా నాయకులు మాత్రం మార్కాపురం చేరుకుని ఫొటోలు దిగి మమ అనిపించి వచ్చారనే వార్తలు ఇప్పుడు పొదిలిలో హాట్‌టాపిక్‌గా మారాయి. ఎమ్మెల్యే కొంత మంది నేతలకు బాధ్యతలు అప్పగించినా వారు లైట్ తీసుకున్నట్లు తెలుస్తుంది. సభ విజయవంతం అయ్యింది కాబట్టి అందరు నాయకులు తామే ప్రజలను తరలించామని చెప్పినా ఆశ్చర్యం లేదు. కాని వాస్తవంగా కష్టపడ్డ కార్యకర్తలను మార్కాపురం ఎమ్మెల్యే నారాయణరెడ్డి గుర్తుంచుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు. ఏ కార్యక్రమం పెట్టినా ఎమ్మెల్యే మాట జవదాటకుండా తాము పని చేస్తామని కార్యకర్తలు చెబుతున్నారు. కానీ నాయకులు మాత్రం ఆ మాటలను చెప్పే పరిస్థితిల్లో లేరు. ఇంకా తమకేమి మా నాయకుడు ఏమీ చేయలేదనే మాటలు నేటికి కూడా వినిపిస్తున్నారు. మరి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇప్పటికైనా పని చేసే వారికి, పని చేయని వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో వేచి చూడాలి...!

# వెలుగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోసం చేశారు

**వైసీపీవన్నీ ఫేక్ మాటలు, ఫేక్ రాజకీయాలే**
**ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు**
**త్వరలోనే వెలుగొండ పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**
**గత 5 ఏళ్లు జగన్ చేసిన మోసాలకే ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారు**
**మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)**
ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు. త్వరలోనే వెలుగొండను పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం మార్కాపురం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం మార్కాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ఎన్నికల ముందు జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోశారు. నాడు వెలిగొండ పూర్తయిందంటూ వైసీపీ నీలి మీడియాలో నానా హంగామా చేశారు, నేడు వైసీపీ నేతలు వెలుగొండకు నిధులు కేటాయించాలని మాట్లాడుతున్నారు. ఇంతకంటే మోసం ఇంకొకటి లేదు, ప్రజలు ఏమనుకుంటారోనన్న కనీస స్పృహ కూడా లేకుండా వైసీపీ నేతలు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారు. వైసీపీవన్నీ ఫేక్ మాటలు, ఫేక్ రాజకీయాలే. ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం, పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దుతాం. గత 5 ఏళ్లు జగన్ చేసిన మోసాలకే 11 సీట్లకు పరిమితమయ్యారు. జగన్ మాదిరి మేం ప్రజలను మోసం చేయం. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ చెప్పిన హామీలన్నీ అమలు చేస్తున్నాం. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

## జనసేన నేత శ్రావణి ఆధ్వర్యంలో 100 బైకులతో ర్యాలీ





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 25)**
మార్కాపురంలో బుధవారం జరిగిన బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు పొదిలి పట్టణం నుంచి జనసేన నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 100 బైకులతో ర్యాలీగా బయలుదేరి మార్కాపురం వెళ్ళారు. తొలుత శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీని శ్రావణి వెంకటేశ్వర్లు బైక్ నడిపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

## ప్రకాశం జిల్లా జేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్‌గా కె శరత్ బాబు, షేక్ అబ్దుల్ హై



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)**
నగరంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ప్రకాశం ఏపీ జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ చైర్మన్‌గా కె శరత్ బాబు, జేఏసీ సెక్రటరీ జనరల్‌గా షేక్ అబ్దుల్ హై (ఖుఖీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేఏసీ చైర్మన్ శరత్ బాబు మాట్లాడుతూ త్వరలోనే జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో జేఏసీ కమిటీలు నిర్మాణం చేపడతామని రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు పోరాట షెడ్యూల్ ప్రకటిస్తామని తెలియజేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర జేఏసీ కమిటీని ఆహ్వానించి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల మీద చర్చించాలని 12వ పిఆర్సి కమిషన్‌ను వెయ్యాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సెక్రెటరీ జనరల్ షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఐఆర్ 29% ప్రకటించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిలకు సంబంధించి రూట్ మ్యాప్ ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. హెల్త్ కార్డు, మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లుల తక్షణమే పరిష్కరించాలని, సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని, మేమో నెంబర్ 57ను వెంటనే అమలు చేయాలని, కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కో చైర్మన్‌లుగా ఆర్ అంజయ్య, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్, ఎం లక్ష్మీనారాయణ ఏపిటిఎఫ్ 1938, ఆర్సిహెచ్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా బి శేషారావు, టి శ్రీనివాసరావు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ఎన్ వి కృష్ణ, ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్, జి ఈశ్వర్‌రెడ్డి ఏపీపిఆర్ డిప్లొమా ఇంజనీర్ అసోసియేషన్, ఎం కోటేశ్వరరావు, ఏపీ వెటర్నరీ ఎంప్లాయిస్ జేఏసీ, జాయింట్ సెక్రెటరీలుగా ఎన్ ఉదయలక్ష్మి, ఏపీ గవర్నమెంట్ నర్స్ అసోసియేషన్ ఎస్‌కె మోమిన్, పంచాయితీ రాజ్ మినిస్ట్రియల్ ఎంప్లాయ్ అసోసియేషన్, కే శ్రీనివాసరావు, పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయ్ అసోసియేషన్, జి శివ శంకర్, ఎస్టియు, మహా విష్ణు స్వర్ణవార్డ్, స్వర్ణ గ్రామ ఎంప్లాయ్ అసోసియేషన్, కే రామయ్య ఏపీ అగ్రికల్చరల్ మినిస్టర్ అసోసియేషన్, బి అంకిరెడ్డి, ఏపీ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కృష్ణ కిషోర్, ఏపీ ఎన్జీవో ట్రెజరర్‌గా కె శివకుమార్, ఏపీఎన్జీవో, ఈసీ మెంబర్లుగా పి నవ కాంత్, ఏపీ ఐటిఐడిఎల్‌టి స్టాఫ్ అసోసియేషన్, వై శివప్రసాద్ ఉమెన్ అండ్ చైల్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, వి శివ లీల, ఏపీ ఎడ్యుకేషనల్ మినిస్ట్రీయల్ సర్వీస్ అసోసియేషన్, కె రత్నాకర్ బాబు, ఏపీ గవర్నమెంట్ ఫార్మాసిటిక్స్ అసోసియేషన్, టి లింగయ్య, ఏపీ హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్, బి వై సుబ్బారెడ్డి ఏపీ ఇరిగేషన్ ఆర్ అండ్ బి, ఆర్‌డబ్ల్యుఎస్ డిపార్ట్మెంట్, డి శ్రీనివాసులు, ఏపీ టెక్నికల్ ఆఫీసర్ అసోసియేషన్, జీవీ రామనాథ్ రాజు, ఏపీ లైబ్రరీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.




## ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పరీక్షలు
### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్







**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 25)**
ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. బాపట్ల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా బుధవారం పరిశీలించారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడారు. ఆకస్మికంగా పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన ఆయన పరీక్షల తీరుతెన్నులు గదుల వెలుపల భద్రతను పరిశీలించారు. ఈ కేంద్రంలో 295 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా, ఐదుగురు గైర్హాజరైనట్లు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి తిలక్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. అన్ని పరీక్ష కేంద్రాలలో పరీక్షలు సజావుగా సాగుతున్నాయన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలన్నింటిలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సాధారణ ఇంటర్మీడియట్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూల్ విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా ఆయా పరీక్షా కేంద్రాలలోనే పరీక్షలు జరుగుతున్నాయన్నారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఆయన వెంట బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసిల్దార్ షాలీమా, తదితరులు ఉన్నారు.

## వెలుగొండ ప్రాజెక్టు పనులకు సీఎం శంకుస్థాపన





**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా, యర్రగొండపాలెం నియోజకవర్గంలో పర్యటించారు. దోర్నాలలోని గంటవాని పల్లె వద్ద వెలుగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ కాలువ పనులకు సీఎం చంద్రబాబు నాయుడు రూ.456 కోట్లతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రైతులతో సంభాషిస్తూ ఫీడర్ కెనాల్ పనులు పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో దోర్నాల రైతులు అమ్మిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండివీరారెడ్డి అనే రైతులతో కలిసి ఫీడర్ కెనాల్ పనుల్ని పరిశీలించి ప్రాజెక్టు పనులు పూర్తయితే భూగర్భ జలాలు పెరుగుతాయని బోర్లకు చెరువులకు నీళ్లు వస్తాయని రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు నమూనా పరిశీలన అనంతరం పనులపై అధికారులతో సమీక్షించారు. వెలిగొండ టన్నెళ్ల పనులతో పాటు క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్న వేర్వేరు ప్రాంతాల్లోని అధికారులతో వీడియోకాన్ఫరెన్సు ద్వారా సీఎం మాట్లాడారు. 11580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కెనాల్ కాలువ పనులు చేపట్టామని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. ఎక్కడ నిర్లక్ష్యం వహించొద్దని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.

## కమలా కాన్సెప్ట్ స్కూల్ ఫేర్‌వెల్ వేడుకలు గ్రాండ్ సక్సెస్
### విద్యార్థుల్లో ఉత్సాహం ఉరకలు

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 25)**
పట్టణంలోని కమలా కాన్సెప్ట్ స్కూల్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల జీవితంలో కీలక మలుపు అయిన ఈ వేడుకను పాఠశాల యాజమాన్యం అంగరంగ వైభవంగా ఏర్పాటు చేయడంతో పాఠశాల ప్రాంగణం ఉత్సాహభరిత వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి కమల గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పెనుగొండ భువన సింధుజ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రార్థనా గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల దశ ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. ఈ దశలోనే క్రమశిక్షణ, దేశభక్తి, సహనం, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు వంటి గొప్ప లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కష్టపడి చదవడం, లక్ష్యసాధనపై దృష్టి పెట్టడం అవసరమని ఆమె ప్రేరణాత్మక సందేశం అందించారు. పాఠశాల ప్రిన్సిపల్ పుల్లయ్య , మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటివని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు, సమయపాలన, ప్రశ్నపత్రం చదివే విధానం, సమాధానాలను సరిగ్గా రాయడం వంటి అంశాలపై విద్యార్థులకు విపులంగా వివరించారు. భయం లేకుండా ధైర్యంగా పరీక్షలు రాసి అత్యున్నత మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం కమల సీబీఎస్ఈ ప్రిన్సిపల్ డాక్టర్ స్వరూప్ రంజన్ ,, సుధాకర్ , ఏవో సుధాకర్ , కమల బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ మురళి తదితరులు విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే విజయాన్ని ఖచ్చితంగా సాధించగలడని వారు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, వినోదాత్మక కార్యక్రమాలు, స్నేహితులతో గడిపిన అనుభవాల పంచిక వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్ని సందర్భాల్లో విద్యార్థులు గురువులపై తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తపరుస్తూ భావోద్వేగానికి లోనైన క్షణాలు కూడా కనిపించాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.



# జై ముదిరాజ్ స్టిక్కర్ల ఆవిష్కరణ




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)

జై ముదిరాజ్ స్టిక్కర్లను ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రకాశం జిల్లా అధ్యక్షులు చంబల్లా అయ్యప్ప స్వామి ముదిరాజ్ బుధవారం ఆవిష్కరించారు. సింగరకొండ తిరణాలను పురస్కరించుకొని సింగర కొండ ముదిరాజ్ సత్రం కమిటీ సభ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా అయ్యప్ప స్వామిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి ముదిరాజ్ ప్రకాశం జిల్లా లోగో కలిగిన స్టిక్కర్లను, జై ముదిరాజ్ స్టిక్కర్లను అందజేయడం జరిగింది.

# వనిత క్లబ్ ఆధ్వర్యంలో జరగబోవు మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి

### వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటుకొండు కోటేశ్వరమ్మ





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 25)

మార్చి 8వ తేదీన బద్వేల్ పట్టణంలో జరగబోవు మహిళా దినోత్సవం పురస్కరించుకొని ముందస్తుగా ఒకటో తేదీన బద్వేల్ పట్టణంలోని వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మ, ట్రెజరర్ బచ్చు పార్వతమ్మ, సెక్రెటరీ చిప్పగిరి వెంకటసుబ్బమ్మ పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించబోవు మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని వారు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా బుధవారం వారు జయసిల్క్ షాప్ యజమాని దొంతంశెట్టి జయ కుమార్ సతీమణి శిరీష, విష్ణు ప్రియ సిల్క్స్ యజమాని అడ్వకేట్ పత్తి నాగేంద్ర ప్రసాద్ సతీమణి హేమలత లను కలిశారు. మహిళా దినోత్సవ వేడుకలు జరుపుట కొరకు ప్రతి ఒక్కరు కూడా విరాళాలకు సహకరించి జరగబోవు మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని అధ్యక్షులు కోటేశ్వరమ్మ, బచ్చు పార్వతమ్మ పలువురు ఆర్యవైశ్యులను కలిసి కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా దినోత్సవ వేడుకలను ఒకటో తేదీన బద్వేల్ పట్టణంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమంలో బద్వేల్ పట్టణంలోని ఆర్యవైశ్యులు, మహిళలు అందరు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందజేయాలన్నారు. వారు పట్టణంలో పలువురు వ్యాపారస్తులను, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళా మణులను కలిశారు.

# రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 25)

మండల కేంద్రమైన ఉలవపాడు శ్రీ సాయి ఒలంపియాడ్ స్కూల్, ఉలవపాడు పోలీస్ విభాగం వారి ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ, కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే అనర్థాలు, ప్రాణం కోల్పోవడం వల్ల తల్లిదండ్రులు పడే బాధ, ప్రయాణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు అనే అంశంపై శ్రీ సాయి ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు నాటకము మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. రోడ్డు భద్రత, జాగ్రత్తల మీద విద్యార్థులు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉలవపాడు పోలీస్ విభాగం వారు, గ్రామస్తులు ప్రశంసించారు.

# పటిష్ట బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన సిఎం చంద్రబాబునాయుడు పర్యటన

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)

మార్కాపురం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కాలువ పనుల శంకుస్థాపన కార్యక్రమం, ప్రాజెక్ట్ టన్నెల్ పనుల పరిశీలన, మార్కాపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా గుంటూరు రేంజ్ ఐజీ ర్వ శ్రేష్ఠ త్రిపాఠి, మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ముఖ్యమంత్రి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠమైన భద్రత ఏర్పాట్లను చేపట్టడం జరిగింది. పర్యటనకు ముందుగా హెలిప్యాడ్ ప్రాంగణం, వీఐపీ రూట్లు, ఫీడర్ కాలువ శంకుస్థాపన స్థలం, టన్నెల్ ప్రాంతం, ప్రజావేదిక ప్రాంగణం మరియు పార్కింగ్ ప్రాంతాలను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు తెలియజేసి, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావేదిక, హెలిప్యాడ్, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయటం జరిగింది. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో ముందస్తు తనిఖీలు నిర్వహించారు. విఐపీ రాక కొరకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవడం జరిగింది. ప్రజల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను క్రమబద్ధంగా ఏర్పాటు చేయటం జరిగింది. ట్రాఫిక్ నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించి, ముందస్తు మళ్లింపులు అమలు చేయడంతో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. ఫీడర్ కాలువ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రాజెక్ట్ పురోగతిని సమీక్షించగా, అనంతరం మార్కాపురం ప్రజావేదికలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని కార్యక్రమాలు విజయవంతంగా పూర్తైన అనంతరం ముఖ్యమంత్రి పర్యటనను ముగించి బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళిక ఏర్పాటు చేసి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తైందని తెలిపారు. బందోబస్తు నిర్వహణలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, ట్రాఫిక్ విభాగం, ప్రత్యేక బలగాలు, సహకరించిన ఇతర ప్రభుత్వ శాఖల అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రజలందరకు జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తే ఏ కార్యక్రమమైనా విజయవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు.











# అంగన్‌వాడీల వేతనాలు పెంచేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)

అంగన్‌వాడీల వేతనాలు పెంచేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రకాశంజిల్లా ప్రధానకార్యదర్శి ఈదర అన్నపూర్ణ అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. అంగన్వాడీల వేతనాల పెంచాలని, ఫ్రీస్కూల్ బలోపేతం చేయాలని రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ వద్ద రిలే నిరహారదీక్షలను ఆమె ప్రారంభించారు. ఒంగోలు, ఉలవపాడు, కందుకూరు ప్రాజెక్టుల నుండి 15 మంది రిలే నిరహారదీక్షలు చేసారు. వారికి సంఘీబావంగా 200మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. ఈ రిలే నిరహారదీక్షలలో అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీలు వేతనాల పెంచాలని 42 రోజులు సమ్మెలో నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి ప్రభుత్యం వచ్చిన వెంటనే వేతనాలు పెంచుతామని చేసిన వాగ్ధానాన్ని వమ్ముచేసారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు కావస్తున్నా 2 బడ్జెట్లు పెట్టినా నేటికి అంగన్వాడీల వేతనాల ఊసే ఎత్తకపోవడం మహిళలను నిలువునా మోసగించడమేనన్నారు. గుజరాత్ హైకోర్టు అంగన్వాడీ టీచర్ 24800, ఆయాకు 20300 వేతనాలు అమలు చేయాలని తీర్పునిచ్చినా రాష్ట్రంలో అతి తక్కువగా ఆయాలకు 7000 మాత్రమే ఇస్తున్నారన్నారు. వేతనాలు పెంచని ప్రభుత్వం పని భారం మాత్రం పెంచిందన్నారు. రిటైర్మెంట్ బెన్ఫిట్స్, ఫెన్షన్ లేకుండా ఒట్టిచేతులతో అంగన్వాడీలను ఇంటికి సాగనంపుతున్నారన్నారు. మహిళల శ్రమకు తగిన ఫలితం ఇవ్వకుండా నమ్మించి మోసంచేయడమే మహిళల ఉద్దరణ అని ప్రశ్నించారు. సమ్మె ఒప్పందాలను కూటమి ప్రభుత్వం అమలుచేయడంలేదన్నారు. గ్రాట్యుటి అసలు లక్ష్యాలకు ప్రభుత్వ జీఓ తూట్లుపొడిచిందన్నారు. రోజు రోజకి ఫ్రీస్కూల్స్ ను నిర్వీర్యంచేస్తుందన్నారు. అంగన్వాడీ వేతనాలు పెంచి బడ్జెటులో తగిన నిధులు కేటాయించాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకుండా ఐసిడియస్ ను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. యఫ్ఆర్‌యస్‌యాఫ్‌తో లబ్ధిదారులును తగ్గిస్తున్నారు. బడ్జెట్‌లో నిధులు పెంచి ఫ్రీ స్కూల్ పిల్లలందరికి తల్లికి వంధనం అమలు చేయాలన్నారు. అంగన్వాడీలందరిని పర్మినెంట్ చేసేంతవరకు వేతనాలతో సంబందంలేకుండా ప్రభుత్వ సంక్షేమపథకాలను అందరికి అమలుచేయాలన్నారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి కల్పన మాట్లాడుతూ అంగన్వాడీలకు మే నెలంతా వేసవి సెలవు ఇవ్వాలని అన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు పియఫ్, ఇయస్ఐను అమలుచేయాలని అన్నారు. సిఐటియు జిల్లానాయకులు జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం జీతాలు పెంచకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ రిలే నిరహారదీక్షలలో సిఐటియు జిల్లాకార్యదర్శి జి రమేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు ఇందిరావతి, ఒంగోలు ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు బి పద్మ, కె హెమీమా, కందుకూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు రాజేశ్వరి, ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్షరాలు లతారెడ్డి, గీత, నాయకులు స్వాతి, శ్రీదేవి, ఉషా, ముక్తార్, సుభాషిణి, జ్యోతి, మార్తమ్మ, శ్రీలత, మాధవి, శ్రీలక్ష్మి, సిఐటియు నాయకులు గౌస్ బాష, వెంకయ్యలు పాల్గొన్నారు.




# అసెంబ్లీ సమావేశాలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

### డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఫిబ్రవరి 25)

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ లతో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇద్దరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగ యువతీ యువకులకు ఎన్నికల ముందు హామీలు దండిగా ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ముఖ్యంగా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వదులుతామని చెప్పారని, అలాగే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ రెండు సంవత్సరాలు అవుతున్న ఒక్క నిరుద్యోగికి అయినా నిరుద్యోగ భృతి ఇచ్చారని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే గడిచిన రెండు సంవత్సరాలు పైబడి అవుతున్న ఒక్క జాబ్ కేలండర్ విడుదల చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో అయినా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతికి నిధులు కేటాయిస్తారు అనుకుంటే కేటాయించకపోవడం చాలా దారుణం అన్నారు. ఈ లెక్కల ప్రకారం నిరుద్యోగ భృతి ఇంతకు ఇస్తారా లేకుంటే ఇవ్వరా అనేది కూడా నిరుద్యోగులలో అయోమయంలో ఉండే పరిస్థితి నెలకొన్నాయి. ఉద్యోగాల కోసం గ్రామీణ ప్రాంత యువతీ, యువకులు పట్టణ కేంద్రాలలో కోచింగ్ సెంటర్లలో సంవత్సరాలు తరబడి కోచింగ్ తీసుకుంటూ వేలకు వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. అటువంటి వారికి ఈ నిరుద్యోగ భృతి ఎంతగానో ఉపయోగపడుతుంది. కావున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించి ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని వారు హెచ్చరించారు.




# ఆదర్శ కమ్యూనిస్టు, న్యాయవాది 'ముదివర్తి' ముదివర్తి రాఘవరావు సంతాప సభలో వక్తలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)

ఆదర్శ కమ్యూనిస్టు, న్యాయవాది ముదివర్తి రాఘవరావు అని పలువురు వక్తలు అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది, ది విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ ముదివర్తి రాఘవరావు సంతాప సభ ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో బుధవారం నిర్వహించారు. సభకు సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాష్‌రావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముందుగా ముదివర్తి రాఘవరావు చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర నాయకులు, ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు ( అన్న), సిపిఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే నారాయణ తో పాటుగా పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కష్టపడిన వారికి ఉన్నత శిఖరాలలో ఉండటంతో పాటుగా, సమాజంలో మంచి గౌరవం దక్కుతుందని చెప్పటానికి కామ్రేడ్ ముదివర్తి రాఘవరావు గొప్ప ఉదాహరణ అన్నారు. అతను జీవించినంత కాలము కమ్యూనిస్టుగా ఉండటం గొప్ప విశేషం అన్నారు. ఒంగోలులోనే కాకుండా, జిల్లా వ్యాప్తంగా ముదివర్తి రాఘవరావుకు రాజకీయాలకతీతంగా మంచి వ్యక్తిగా, ముక్కు సూటి న్యాయవాదిగా మంచి పేరు ఉందన్నారు. ఒంగోలు నగరంలో సిపిఐ అభివృద్ధికి కీలకంగా పని చేశారన్నారు. పేద కుటుంబంలో జన్మించిన రాఘవరావు పులికొండ గ్రామం నుండి 15 ఏళ్ల వయసులో ఒంగోలుకు వచ్చి ప్రముఖ న్యాయవాది సర్వది వెంకటేశ్వర్లు వద్ద ప్లీడర్ గుమస్తా గా చేరారు అన్నారు. జెవి నరసింహారావుతో సహవాసంగా ఉంటూ తన ఉద్యోగం చేసుకోవటంతో పాటుగా ప్రతిరోజు నెల్లూరు రైలులో వెళ్లి లాను అభ్యసించారన్నారు. కరవది వెంకటేశ్వర్లు వద్ద కొంతకాలం జూనియర్ గా ప్రాక్టీస్ చేసిన మొదటి ఆ తర్వాత కాలంలో సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించారన్నారు. ముదివర్తి మృతి వృత్తిపరంగానే కాకుండా, కుటుంబానికి, సిపిఐ కి తీరని లోటు అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ తాను శర్మ కాలేజీలో చదువుకునేందుకు 1987లో చేరానని, అప్పటినుండి ముదివర్తితో మంచి పరిచయం అన్నారు. ఒంగోలులో మంచి న్యాయవాదిగా, బార్ కౌన్సిల్ అధ్యక్షులుగా, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా, విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్గా, ఒంగోలు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ గా, ప్రభుత్వ ప్లీడర్ గా అన్ని రంగాలలో తనకు తానే చాటి అన్న తీరుగా పనిచేశారు అన్నారు. రెండు నెలల క్రితం ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం డైరెక్టర్ గా పనిచేసేందుకు పార్టీ నుండి లెటర్ అడిగిమరీ పంపించారన్నారు. అయితే ఆయన చివరి కోరిక తీరలేదన్నారు. ఒంగోలులో ట్రేడ్ యూనియన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన లేని లోటు సిపిఐ కి తీర్చలేనిది అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉప్పుటూరి ప్రకాష్ రావు మాట్లాడుతూ రాఘవరావు 55 సంవత్సరాలు పాటు పార్టీ కోసం పని చేశారన్నారు. అతనిని ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేసినప్పుడు పార్టీ వల్లనే తనకు ఆ పదవి దక్కిందని అందువల్ల తనకు ప్రభుత్వం నుండి వచ్చే ఆండోరియంలో పార్టీకే ఇస్తున్నట్లు ప్రకటించడంతోపాటుగా, అతను ప్రభుత్వ న్యాయవాదిగా ఉన్నంతకాలం వచ్చిన ఆండోరియం మొత్తం సిపిఐ కి అందజేశారు అన్నారు. ఒంగోలు నియోజక వర్గం సమన్వయకర్త చుండు బాబు మాట్లాడుతూ టిడిపి పెట్టక ముందు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలంతా కమ్యూనిస్టు పార్టీలతో నడిచేవారన్నారు. ముదివర్తి రాఘవరావు, తన తండ్రి క్లాస్మేట్స్ అని పేర్కొన్నారు. దీంతో రాఘవరావు తనను ఎప్పుడూ తన కొడుకు గానే చూసేవాడన్నారు. తనకు సంబంధించిన వ్యాపార కోర్టు కేసులన్నీ ఆయనే వాదించేవారన్నారు. తగు సలహాలు, సూచనలు ఇచ్చేవారన్నారు. ఎన్నడు ఫీజు నోరు తెరిచి అడిగే వారు కాదన్నారు. ముదివర్తి రాఘవరావు మరణం తన ఇంటి కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లుగా ఉందన్నారు. సిఐటియు నాయకులు దామా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి సమాజ మార్పునకు రాఘవరావు లాంటి కమ్యూనిస్టు ఎంతో అవసరం అన్నారు. తాను మునిసిపల్ ఎన్నికలలో పోటీ చేసినప్పుడు ఎంతో సహకరించారన్నారు. డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ గొప్ప న్యాయవాది తన జీవితకాలం సిపిఐ లో కొనసాగటం గొప్ప విశేషం అన్నారు. బ్రాహ్మణ సమాజం నుండి వచ్చిన వ్యక్తి అయినప్పటికీ అన్ని కులాలను తాను సమానంగా చూడటంతో పాటుగా, రాఘవ కుటుంబ సభ్యులు కూడా అలాగే కలిసి మెలిసి ఉండేవారన్నారు. ఇది కేవలం రాఘవరావు లోని కమ్యూనిస్టు భావజాలం నుండి వచ్చిన గొప్ప లక్షణం అన్నారు. ఏఐబిఏ నాయకులు రాజీవ్ రత్న మాట్లాడుతూ తమ సంఘం అభివృద్ధిలో రాఘవరావు ఎంతో తోడ్పాటును అందించారు అన్నారు. ఆయన న్యాయ సూచనలు, సలహాలు తమ అభివృద్ధికి ఎంతో ఉపకరించాయి అన్నారు. టిడిపిఎఫ్ బ్యాంకు చైర్మన్, ప్రముఖ న్యాయవాది పోతినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమది 40 సంవత్సరాల అనుబంధం అన్నారు. తాను కరవది వెంకటేశ్వర్లు వద్ద జూనియర్ గా చేసినప్పుడు , రాఘవరావు తాను కలిసిమెలిసి ఉండే వాళ్ల మన్నారు. ఇద్దరిలో కమ్యూనిస్టు భావజాలం కలిగి ఉండటమే దీనికి కారణమై ఉండవచ్చు అన్నారు. అతని ఇంటికి పోతే బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వ్యక్తి అనే భావన కలిగేది కాదన్నాడు. ప్రకాశం జిల్లా బ్యాంక్ రిటైరీస్ ప్రధాన కార్యదర్శి పీకే రాజేశ్వరరావు మాట్లాడుతూ తనకు విద్యార్థి దశ నుండి రాఘవరావుతో పని చేయమన్నారు. తాను పనిచేసే బ్యాంకుకే కాకుండా అనేక బ్యాంకులకు న్యాయ సలహాదారునిగా ముదివర్తి సేవలు అందించారు అన్నారు. ముక్కుసూటి తనం అతని వ్యక్తిత్వానికి ఎంతో అందం ఇచ్చిందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి మాట్లాడుతూ ఒంగోలు సిపిఐ ఎదుగుదలలో ముదువర్తి కీలకపాత్ర పోషించారు అన్నారు. అనేక కార్మిక ఉద్యమాలలో ఎర్ర చొక్కా ధరించి మరి పాల్గొనేవారు అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు ఎస్ డి సర్దార్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుండి తనకు ముద్దుబట్టితో స్నేహం ఉందన్నారు. ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలను విస్తృతంగా ముదివర్తి పాల్గొనేవారు అన్నారు. రిటైర్డ్ ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ బోడపాటి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ముదివర్తి మరణం ఒంగోలులో సిపిఐ కి తీర్చలేనిదే అన్నారు. ఈ సంతాప సభలో సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు,సరోజ సేవా ఫౌండేషన్ చైర్మన్ చిడిపోతూ వెంకటేశ్వర్లు, వి సింగయ్య, బిఎస్ఎన్ఎల్ నాయకులు రామలింగం, రావూఫ్,పలు ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన బీజేపీ నేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ప్రకాశం జిల్లాలో పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా రూ.456 కోట్లతో నిర్మించనున్న ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసేందుకు మధ్యాహ్నం 1.32 గంటలకు హెలికాప్టర్ ద్వారా దోర్నాల మండలం, గంటవానిపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు హెలిప్యాడ్ వద్ద బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ముఖ్యమంత్రికి స్వాగతం పలికే కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే మర్యాదపూర్వకంగా కలిసి మార్కాపురం జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే, వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి, ఈ ప్రాంత రైతాంగానికి, ప్రజలకు అంకితం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏలూరి అభ్యర్థనపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తూ, "తప్పకుండా చేద్దాం" అని ఆప్యాయంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి, ఎన్డీఏ ప్రభుత్వానికి ఏలూరి ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు సీఎం పర్యటనలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశి, యర్రగొండపాలెం టిడిపి ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆర్డీవోగా పి ప్రభాకర్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఫిబ్రవరి 25)



మార్కాపురం నూతన జిల్లా కేంద్రం ఆర్డీవోగా పెంచల ప్రభాకర్‌రావు నియమితులయ్యారు. ఈయన గుంటూరు జిల్లా నుండి ఇక్కడికి బదిలీ పై రానున్నారు. ఇప్పటివరకు మార్కాపురం ఇంచార్జి సబ్ కలెక్టర్‌గా పని చేసిన మాదాల శివరామిరెడ్డి తిరిగి శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్డిసి)గా వెళ్లనున్నారు. ఆర్టీవోగా నియమితులైన ప్రభాకర్‌రావు 26 తేదీ బుధవారం ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## యురేకా సైన్స్ ఎక్స్పో 2026 పోస్టర్ అవిష్కరణ



(షణ్ముఖ వెలుగు, చినగంజాం, ఫిబ్రవరి 25)

విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను పెంపొందించడం, రేపటి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా మండలంలోని స్థానిక చిన్నగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రేపటి శాస్త్రవేత్తల కోసం యురేకా సైన్స్ ఎక్స్పో– 2026 రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు సైన్స్ మాసం అయిన ఫిబ్రవరి నెలలో 28న జరుపబడుతున్నాట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కుర్ర రామారావు తెలిపారు. ఇ సందర్భంగా కుర్ర రామారావు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయిలో ఈ సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలకు ప్రతి పాఠశాల నుంచి పాల్గొనాలని అయిన కోరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యురేకా సైన్స్ ఎక్స్పోర్ట్– 2026 పోస్టర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మండల జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు నరసింహరావులతో కలసి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు కుమార్, నాగేశ్వరరావు, కోటిరెడ్డి, ప్రసాదరావు, కడవకుదురు, మ్యాథ్స్ అసిస్టెంట్ ప్రసాదు పాల్గొన్నారు.

## బాపట్ల జిల్లాలో 'సేవా సేతు' అమలు అభినందనీయం

### రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, ఫిబ్రవరి 25)

జిల్లాలో పి4 స్ఫూర్తితో అమలు అవుతున్న 'సేవా సేతు' కార్యక్రమం అభినందనీయమని రాష్ట్ర ప్రిన్సి పల్ సెక్రటరీ పీయూష్ కుమార్ పేర్కొన్నారు. పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కేపీఐ), పి4 కార్యక్రమాల పై అమరావతి నుంచి హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు, ముఖ్య ప్రణాళిక అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సీవీఏపీ, డివిఏపీ బృందాలు, యంగ్ ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ జిల్లాలో అమలు చేస్తున్న చర్యలను వివరించారు. పి4 కింద చేపడుతున్న 'బాపట్ల సేవా సేతు' కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాల గుర్తింపు, దత్తత, ధృవీకరణ విధానాలను పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గాల వారీగా సీవీఏపీ, డివిఏపీ బృందాల సమన్వయం, మౌలిక వసతుల వినియోగంపై సమగ్ర వివరాలు అందించారు.జిల్లా కేపీఐలో 83 స్కోర్ సాధించి 'ఏ' గ్రేడ్ పొందగా, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు 85–87 మధ్య స్కోర్లు సాధించినట్లు వెల్లడించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ అన్ని జిల్లాలు నెలవారీ, వారవారీ సమీక్షలు నిర్వహించి ప్రతి నియోజకవర్గాన్ని 'ఏ ప్లస్' గ్రేడ్ దిశగా తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో సీపీఓ సాల్మన్ రాజు పాల్గొన్నారు.

## లబ్ధిదారులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 25)



అక్షరాంధ్ర కార్యక్రమం చదువు నేర్చుకునే లబ్ధిదారులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యల పై విద్యాశాఖ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ పి రంజిత్ బాషా అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని అమరావతి నుంచి బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ వీక్షణ సమావేశంనకు హాజరైనారు. అక్షరాస్యత పెంచడం, డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్– అక్షర ఆంధ్ర కార్యక్రమము ప్రధాన ఉద్దేశ్యం అని కోన శశిధర్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో మన రాష్ట్రంలో గత నవంబర్ మాసము నుండి అమలు చేయడమైనదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చదువు నేర్చుకున్న వారు చదవడం, రాయడం మరియు లెక్కలు చేయడం వంటి అంశాలలో ఏమాత్రం పురోగతి సాధించారని అంచనా వేయడానికి ప్రభుత్వం మార్చి 15వ తారీఖున ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్మెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని ఆయన తెలిపారు. లబ్ధిదారులు వారికి వీలైన సమయంలో పరీక్షా కేంద్రానికి వచ్చి పరీక్షలు రాయవచ్చని ఆయన చెప్పారు. ఈ పరీక్ష 3 గంటల పాటు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తిస్తూ నేషనల్ లిటరసీ మిషన్ అథారిటీ మరియు జాతీయ సార్వత్రిక విద్యాసంస్థ వారు సంయుక్తంగా అధికారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని ఆయన చెప్పారు. ఈ పరీక్షలను లబ్ధిదారులకు అందుబాటులో వారి గ్రామాల్లోనే నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని చదువు నేర్చుకున్న మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. వయోజన విద్య నేర్చుకునే మహిళలకు ఈనెల 28వ తారీఖున ఫ్రీ ఫైనల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనా శశిధర్ తెలిపారు. ఈ పరీక్షకు లబ్ధిదారులందరూ హాజరై వారి పురోగతిని పరీక్షించుకొని, మార్చి 15వ తారీకు జరిగే చివరి పరీక్షకు సన్నద్ధం కావాలని, లబ్ధిదారులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా కలెక్టర్లకు తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో వయోజన విద్య జిల్లా నోడల్ ఆఫీసు మధుసూదన్‌రావు, పిడి డిఆర్డిఏ సింగయ్య, మహిళా శిశు సంక్షేమశాఖ పిడి రాధా మాధవి, బాపట్ల డిఎల్డిఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# శనగ రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా

# శనగ రైతుకి గిట్టుబాటు గ్యారెంటీ

## ఈనెల 28 న 19 కేంద్రాలలో కొనుగోలు ప్రారంభం

## సీఎం చంద్రబాబు ఆదేశాలతో మద్దతు ధర

## మంత్రి అచ్చెన్న నేతృత్వంలో మార్క్‌ఫెడ్ చర్యలు

## ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడి

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, ఫిబ్రవరి 25)**

శనగ రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ఈనెల 28వ తేదీన పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు నేతృత్వంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ద్వారా 19 బెంగాల్‌గ్రామ్ (శనగ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీన నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని కేంద్రాలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. శనగలకు క్వింటాకు రూ.5,875 కనీస మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో రైతులు మధ్యవర్తుల బారిన పడకుండా ప్రభుత్వ కేంద్రాల ద్వారా నేరుగా పంటను విక్రయించుకునేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

**పారదర్శకంగా కొనుగోళ్లు...**

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు పూర్తిగా పారదర్శకంగా జరుగుతాయని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు తూకం యంత్రాలు, గోదాముల సదుపాయాలు సిద్ధం చేశామని చెప్పారు. సీఎం యాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచే కొనుగోళ్లు చేపడతామని స్పష్టం చేశారు.

**అధికారులకు స్పష్టమైన ఆదేశాలు...**

తేమ శాతం, నాణ్యత ప్రమాణాల ప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కొనుగోలు అనంతరం చెల్లింపులు త్వరితగతిన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రైతులకు విజ్ఞప్తి...**

రైతులు దళారుల ప్రలోభాలకు లోనుకాకుండా ప్రభుత్వ



కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అవసరమైతే 19 కేంద్రాలతో పాటు మరిన్ని కేంద్రాలు కూడా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతి రైతు సీఎం యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

**నియోజకవర్గంలో 19 కేంద్రాలు...**

పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం19 శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ నుంచి శనగ కొనుగోళ్ళు జరుగుతాయని వెల్లడించారు.రైతుల అవసరానికి అనుగుణంగా మరిన్ని కేంద్రాలు కూడా ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

**మండలాల వారీగా కేంద్రాలు ఇలా:**

చిన్నగంజాం మండలంలో చింతగుంపల పీఏసీఎస్, సంతరావూరు పీఏసీఎస్. ఇంకొల్లు మండలంలో భీమవరం పీఏసీఎస్, ఇంకొల్లు పీఏసీఎస్, కొణికి పీఏసీఎస్, పావులూరు పీఏసీఎస్. కారంచేడు మండలంలో ఆదిపూడి పీఏసీఎస్, దగ్గుబాడు పీఏసీఎస్, నాయుడువారిపాలెం పీఏసీఎస్, కొడవలివారిపాలెం పీఏసీఎస్. మార్టూరు మండలంలో కోలలపూడి పీఏసీఎస్, యద్దనపూడి మండలంలో పూనూరు పీఏసీఎస్, పర్చూరు మండలంలో బోడవాడ మందగుంట పీఏసీఎస్, నాగులపాలెం పీఏసీఎస్, నూతలపాడు పీఏసీఎస్, రమణయ్యపాలెం పీఏసీఎస్, వీరన్నపాలెం పీఏసీఎస్, పోతుకట్ల పీఏసీఎస్, పర్చూరు పీఏసీఎస్‌లు సేకరణ చేయ్యనున్నాయి.

---

## సంపత్ సూర్యకు లాప్ టాప్ బహూకరణ

### ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలుస్తాం

### శ్రీగిరి దేవస్థానం నిర్వాహకుల వెల్లడి





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఆదూరి ప్రద్యుమ్న కుమార్ (బుజ్జి స్వామి) లక్ష్మి దంపతుల కుమారుడు రైజ్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆదూరి సంపత్ సూర్యకు లాప్ టాప్ అత్యవసరం కావడంతో ఆ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులు శ్రీగిరి ధర్మకర్తల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి లాప్ టాప్‌ను బుధవారం సంపత్ సూర్యకు అందజేశారు. తమ కుమారుని చదువుకు ఆటంకం కలగకుండా లాప్‌టాప్‌ను అందించిన శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులకు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు ఝాన్సీరాణి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు వారి చదువు నిర్విఘ్నంగా సాగేలా చూడడంతో పాటు విద్యా వైద్య సామాజిక ఆధ్యాత్మిక ధార్మిక సేవా రంగాల అభ్యున్నతికి తోడ్పాటును అందించడం తమ లక్ష్యమని వెల్లడించారు. శ్రీగిరి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు స్పూర్తితో తాము కూడా సేవా మార్గంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గతంలో కూడా ఎంతోమంది ప్రతిభావంతులైన విద్యార్థులకు వారి చదువుకు అవసరమైన ఫీజులను చెల్లించడంతోపాటు లాప్ టాప్ లను కూడా అందజేయడం జరిగిందని పలు పాఠశాలలకు కూడా లాప్ టాప్ లను అందించినట్లు పేర్కొన్నారు. మానవసేవే మాధవ సేవ అని గుర్తు చేశారు.

## మున్సిపాలిటీకి దోమల స్ప్రే పంపు మిషన్‌ను బహూకరణ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)**

ఒంగోలు నగర అభివృద్ధిలో భాగంగా ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆలోచనలో భాగంగా 25వ డివిజన్ అధ్యక్షులు పులివర్తి అజయ్ కుమార్ దోమల నివారణకు సంబంధించి స్ప్రే పంపు మిషన్ బుధవారం ఉదయం మున్సి పాలిటీ అధికారులకు డొనేషన్ ఇవ్వడం జరిగింది నగరంలో దోమ ల అధికంగా ఉండడంతో తమ వంతు సహాయంగా మున్సిపాలిటీకి ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైష్ణవి, పిచ్చయ్య, 3 టౌన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పులివర్తి సాయిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ పల్లపోతు వెంకటేశ్వర్లు, డివిజన్ ప్రధాన కార్యదర్శి పబ్బిశెట్టి భాస్కర్ బూత్ కన్వీనర్స్ తిరునల్వేలి కన్నయ్య, శికాకొల్లి సత్యనారాయణ బాబు, పబ్బిశెట్టి సురేష్, గొలగాని సుబ్బారావు (చిన్న), బిజెపి నాయకులు పిన్నింటి తిరుమలరావు, చెన్ను రఘురాం, తిరునల్వేలి పవన్ కుమార్, విష్ణు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 28న మహిళా న్యాయవాదుల సదస్సు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 25)**

ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఐఎల్‌పిఏ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28వ తేదీ మహిళా న్యాయవాదుల సదస్సు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ ప్రకాశం జిల్లా ప్రతినిధి, న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (విస్వేశ్వరయ్య భవన్)లో ఉదయం 9 గంటల నుండి జరిగే ఈ సభలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసిరి సీతక్క పాల్గొంటారని, ఈ సదస్సులో ఐఎల్‌పిఏ జాతీయ అధ్యక్షురాలు, ఢిల్లీ హైకోర్టు న్యాయవాది సుజాత చౌదంటే, జస్టిస్ తిరుమల దేవి ఈడ (తెలంగాణ హైకోర్టు), హైదరాబాద్ హైకోర్టు న్యాయవాది స్వర్ణలత, గౌరవ అతిథిగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్, రిజిస్ట్రార్ బి. విజయ లక్ష్మి,న్యాయవాదులు హుస్నా ఖాన్, ఉషా రాణి. (కొత్తగూడెం)టి. లక్ష్మీదేవి,(రంగా రెడ్డి), టి.రేణుక,(సిద్ధిపేట), డాక్టర్ నూకతోటి రవి కుమార్, న్యాయవాది (రాష్ట్ర కమిటీ) తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సదస్సులో పివి క్రాంతి కిరణ్ రచించిన "ది ప్రాక్టికల్ అడ్వకేట్: ఎ గైడ్ టు సివిల్ ప్లీడింగ్స్, డ్రాఫ్టింగ్ మరియు కోర్ట్‌రూమ్ ప్రాక్టీస్" అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, న్యాయవాది ఎం. సుమలత(మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా) సమీక్ష చేస్తారని, మహిళా న్యాయవాదులు ఈ సదస్సులో పాల్గొనాలని వారు కోరారు.

---

## సూర్య ఘర్ యూనిట్ల స్థాపనలో బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, ఫిబ్రవరి 25)**



సూర్య ఘర్ యూనిట్ల స్థాపనలో బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. సౌర విద్యుత్ తో ప్రతి ఇంటిలో వెలుగులు నింపాలని కలెక్టర్ చెప్పారు. బాపట్ల జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని, పురోగతి కనిపించాలన్నారు. 24,620 సూర్య ఘర్ యూనిట్లు స్థాపించాలన్నారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధిని చేకూర్చాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వేగంగా పని చేయాలని సూచించారు. జిల్లాలోని రైతులు పండించిన పంటలను గోదాముల్లో దాచుకోవడానికి గోదాములను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాకు 45 గోదాములు మంజూరు కాగా, అందులో 20 గోదాములు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. 15 గోదాముల నిర్మాణం వివిధ దశలలో ఉన్నాయన్నారు. మిగిలిన గోదాములకు స్థలములు లేక పోవడంపై ఆరా తీశారు. వేరొక గ్రామాలను ఎంపిక చేసి, ఆ గ్రామాలలో స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. రైతు సహకార సంఘాలకు మేలు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సహకార శాఖ, మార్కెటింగ్ శాఖలు సంయుక్తంగా క్షేత్ర పరిశీలన చేయాలని ఆదేశించారు. జిల్లా మినరల్ ఫండ్ ద్వారా మంజూరు చేసిన అభివృద్ధి పనులను అధికారులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఆయా గ్రామాలలో ఆర్ డబ్ల్యు ఎస్ ద్వారా మొదలుపెట్టిన పైప్ లైన్ నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని, నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. వేటపాలెం, చిన్నగంజాం తదితర మండలాలలో మొదలైన పనులు ఏప్రిల్ 15వ తేదీన పూర్తి చేయాలన్నారు. నిజాంపట్నం నిర్మల్ నగర్ లో రూ.1.20 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులలో జాప్యం లేకుండా పర్యవేక్షించాలన్నారు. చిన్నగంజాం మండలంలో రూ.రెండు కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులు ఏప్రిల్ లోగా పూర్తి చేయాలన్నారు. రూ.3.22 కోట్లతో తాతావారిపాలెం రహదారి పనులు మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రూ.29 లక్షలతో వన్ స్టాప్ సెంటర్ సఖి కేంద్రాన్ని మంజూరు చేయగా ఆరు నెలలైనా ప్రారంభించకపోవడంపై సంబంధిత డిఈ ని మందలించారు. రూ.10 లక్షలతో బాలసదన్ భవన నిర్మాణ పనులను మార్చి 15వ తేదీకి పూర్తి చేయాలన్నారు. శిశు గృహంలో మరమ్మతు పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. 73 అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ షాలేము రాజు, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, భూగర్భ గనులశాఖ అధికారి ఫణి కుమార్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, ఆర్ అండ్ బి డీఈ అరుణకుమారి, మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి రాధామాధవి, తదితరులు పాల్గొన్నారు.



---

## శ్రీ సత్యసాయి సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

### 142 మంది బాలికోన్నత విద్యార్థినిలకు అల్పాహారం పంపిణీ







**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఫిబ్రవరి 25)**

శ్రీ సత్యసాయి సేవా సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమని పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి అన్నారు. శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యుల సహకారంతో పట్టణంలోని పీఎంశ్రీ జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో సాయంత్రం స్టడీ అవర్స్ లో ఉన్న 142 మంది పదవ తరగతి విద్యార్థినీలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినిలకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యే వరకు శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు విద్యార్థినిలకు అల్పాహారం అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. సాయంత్రం వేళ విద్యార్థినిలకు అల్పాహారం అందజేయడం వలన అలసట లేకుండా విద్యార్థులు బాగా చదువుకుంటూ ఉత్సాహంగా ఉండగలరని, చదువుపై ఏకాగ్రత ఉంచగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వాడకట్టు కోటేశ్వరరావు, సత్యనారాయణ, బిక్షమయ్య, సంజీవయ్య, వెంకటేశ్వర్లు, వాణి, కౌసల్య, కోటేశ్వరరావు, ధనమ్మ, బాల వెంకటేశ్వర్లు, సతీష్ , పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మి, మాధురి, యశోద, నాగమణి, లక్ష్మీ కుమారి, పద్మలత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.